Toli Velugu 29.01.26_Layout 1 1/29/2026 10:09 AM Page 1


# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 21 | పేజీలు : 4 | గురువారం 29 జనవరి 2026 | వెల : 2/-





విమాన ప్రమాదంలో

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

- బారామతి వద్ద విమానం కూలి మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి
- ప్రమాదంలో పైలట్లు, భద్రతా సిబ్బంది సహా మొత్తం ఐదుగురి దుర్మరణం
- ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ల్యాండింగ్ సమయంలో ఘటన
- స్థానిక సంస్థల ఎన్నికల సభలకు వెళ్తుండగా జరిగిన విషాదం



డెస్క్, జనవరి 28 (తొలివెలుగు) : మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన ప్రయాణిస్తున్న చిన్న విమానం బారామతి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు పైలట్లు, భద్రతా సిబ్బంది సహా మొత్తం ఐదుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు.

మిగతా 2 లో..

## మేడారంలో ధరల షాక్..

# ఆకాశాన్నంటిన రేట్లు..

- ప్రారంభమైన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర
- భక్తులను బెంబేలెత్తిస్తున్న ఆకాశాన్నంటిన ధరలు
- కోళ్లు, మేకల ధరలు రెట్టింపు.. గదుల అద్దెలు వేలల్లో
- చెట్టు కింద నీడకు కూడా అద్దె వసూలు చేస్తున్న వైనం
- ధరల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని భక్తుల విజ్ఞప్తి

### చెట్టు నీడకూ అద్దె వసూలు!



డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. అయితే, వనదేవతలను దర్శించు కోవడానికి వచ్చిన భక్తులకు ధరల మోత తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. జాతర పరిసరాల్లో నిత్యావసరాల నుంచి బస చేసే గదుల వరకు అన్ని ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**కోడి, మేకల ధరలు రెట్టింపు.. భక్తుల జేబులకు చిల్లు..**

జాతరలో అమ్మవార్లకు మొక్కుగా బెల్లం(బంగారం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పించడం ఆనవాయితీ. దీన్నే అదునుగా చేసుకున్న వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచేశారు. సాధారణంగా కిలో రూ. 420 పలికే మేకపోతు లైవ్, మేడారంలో రూ. 900 నుంచి రూ. 1000 వరకు విక్రయిస్తున్నారు. ఇక, మటన్ ధర అయితే ఏకంగా రూ. 1500కు చేరింది. బయట మార్కెట్‌లో కిలో రూ. 170-180 ఉండే బ్రాయిలర్ కోడిని ఇక్కడ రూ. 300 నుంచి ....

☞ 2

## గల్లీ నుంచి ఢిల్లీ వరకు కేసీఆర్ మీద చెప్పే అబద్ధం అదే : కేటీఆర్



- కేసీఆర్ ఏడెనిమిది లక్షల కోట్ల అప్పులు చేశారని చెబుతున్నారని ఆగ్రహం
- పార్లమెంటులో బీజేపీ ఎంపీ అప్పు గురించి అడిగితే రూ.3.5 లక్షల కోట్లు అని తేలిందని వెల్లడి
- ఈరోజు ఓపిక లేని వ్యక్తి తెలంగాణను పాలిస్తున్నారని సీఎంపై ఆగ్రహం

డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకటే అబద్ధం చెబుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో ఏడెనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పు చేశారని వారు చెబుతున్నారని, కానీ పార్లమెంటులో బీజేపీ ఎంపీ ఒకరు అడిగిన ప్రశ్నకు స్పష్టమైన సమాధానం వచ్చిందని అన్నారు. కేసీఆర్ హయాంలో రూ.3.5 లక్షల కోట్ల అప్పులు అయ్యాయని తేలిందని, అందులో కేసీఆర్ గద్దెను ఎక్కే నాటికి రూ.72 వేల కోట్ల అప్పు తెలంగాణకు ఉందని తెలిపారు. అంటే కేసీఆర్ పదేళ్ల కాలంలో చేసిన అప్పు రూ.2.5 లక్షల కోట్లు మాత్రమే అన్నారు. ఆ అప్పు తో కూడా ఎన్నో సంక్షేమ ...

2



## మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి అమిత్ షా రాక, ఫిబ్రవరి 3 నుంచి రేవంత్ రెడ్డి ప్రచారం

- ప్రచారం కోసం అమిత్ షా, నితిన్ నబీన్ సిన్హా రానున్నారని తెలిపిన రామచందర్ రావు
- 10 రోజుల్లో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు వెల్లడి
- అమెరికా నుంచి తిరిగి వచ్చాక కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం ప్రారంభించనున్న

☞ 2

## హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు..




- 32 మందికి కొత్త పోస్టింగులు ఇస్తూ సీపీ ఉత్తర్వులు
- సీపీ కార్యాలయానికి మరో 14 మంది అధికారుల అటాచ్
- నాంపల్లి, లాలాగూడ, టాస్క్‌ఫోర్స్‌కు కొత్త సీఐల నియామకం

మిగతా 2 లో..

## నేను విద్యాశాఖ మంత్రిని అయితే

### కార్పొరేట్ విద్యా సంస్థలు బంద్ - కోమటిరెడ్డి

- కొన్ని సంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నాయన్న మంత్రి
- లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ దోచుకుంటున్నాయని విమర్శ
- నల్గొండలో రూ.8 కోట్లతో కుమారుడి పేరిట కార్పొరేట్ హంగులతో ప్రభుత్వ పాఠశాల ప్రారంభం




డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కార్పొరేట్ విద్యాసంస్థలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను విద్యాశాఖ మంత్రి అయితే కార్పొరేట్ సంస్థలను మూసివేసి, అందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివేలా ఆదేశాలు జారీ చేస్తానని అన్నారు. మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలో తన కుమారుడు దివంగత ప్రతీక్‌రెడ్డి పేరిట నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవన ప్రారంభోత్సవంలో ఆయన ..

మిగతా 2 లో..

## కడియం శ్రీహరి కారణంగానే పార్టీ నుంచి వెళ్లిపోయా

### - బీఆర్ఎస్‌లో చేరిన ఆరూరి రమేశ్





- అనేకమంది మీద బురద జల్లి రాజకీయంగా ఎదగకుండా చేసిన వ్యక్తి అని ఆరోపణ
- ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డితో ములాకత్ కుదుర్చుకున్నారని విమర్శ
- కడియం శ్రీహరి వల్లే రమేశ్ పార్టీ మారినట్లు చెప్పిన ఎర్రబెల్లి దయాకర రావు

2

## ఏదో ఒక రోజు బాంబు పేలుస్తా

### - కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

- మునుగోడు అభివృద్ధికి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం జరుగుతోందన్న రాజగోపాల్ రెడ్డి
- అభివృద్ధిలో మునుగోడు వెనుకబడిందని ఆవేదన
- ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పనులకు బిల్లులు చెల్లించడం లేదని విమర్శ



డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించడంలో ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఏదో ఒక రోజు బాంబు పేల్చడం ఖాయమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. తనకు పదవి రాకున్నా పర్వాలేదని, కానీ ప్రజల సమస్యలు తీరకపోతే ఏమైనా జరిగిపోతుందని ఆయన స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా మునుగోడు మండలం ....

2

Toli Velugu 29.01.26_Layout 1 1/29/2026 10:09 AM Page 2



# విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

డెస్క్, జనవరి 28 (తొలివెలుగు) : మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన ప్రయాణిస్తున్న చిన్న విమానం బారామతి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు పైలట్లు, భద్రతా సిబ్బంది సహా మొత్తం ఐదుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన నాలుగు బహిరంగ సభల్లో పాల్గొనేందుకు అజిత్ పవార్ ఈ ఉదయం ముంబై నుంచి బారామతికి బయలుదేరారు. ఉదయం 8 గంటలకు ముంబై నుంచి టేకాఫ్ తీసుకున్న విమానం, గంట తర్వాత బారామతి ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా ప్రమాదానికి గురైంది. విమానంలో ప్రయాణిస్తున్న ఐదుగురూ అక్కడికక్కడే మృతి చెందినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వర్గాలు ధ్రువీకరించాయి. ప్రమాద స్థలంలో విమానం శకలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మంటలు, దట్టమైన పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే అంబులెన్సులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ హఠాత్పరిణామంతో మహారాష్ట్ర రాజకీయ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి.



# నేను విద్యాశాఖ మంత్రిని అయితే కార్పోరేట్ విద్యా సంస్థలు బంద్ - కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి.. మాట్లాడారు. కొన్ని కార్పొరేట్ సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చాయని, విద్యాహక్కు చట్టం ప్రకారం పేదలకు 25 శాతం సీట్లు కేటాయించకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఎల్‌కేజీ చదువులకే లక్షల్లో ఫీజులు వసూలు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ప్రాబల్యం తగ్గించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేశారని గుర్తుచేశారు. అంతకుముందు, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని మంత్రి ప్రారంభించారు. బొట్టుగూడ ప్రాంతంలోని ఈ పాఠశాలను 40 ఏసీ తరగతి గదులు, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్స్, లైబ్రరీ వంటి సకల సౌకర్యాలతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్‌చంద్రపవార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ఏదో ఒక రోజు బాంబు పేలుస్తా

## - కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..
కోతులారం గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ కు కూతవేటు దూరంలో ఉన్న మునుగోడు నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పనులు చేపట్టిన బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు సగంలో నిలిపివేసి చేతులెత్తేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లానని, వారం రోజుల్లో పూర్తిస్థాయి బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన సీఎం మూడు వారాలు గడిచినా ఒక్క బిల్లు కూడా చెల్లించలేదని అన్నారు. రాష్ట్రంలో కేవలం సీఎం, మంత్రుల నియోజకవర్గాలలోనే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసుకుంటున్నారు తప్ప ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో బిల్లులు ఇవ్వకపోగా నూతన పనులను కూడా మంజూరు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ప్రజల ప్రాణాలకు హాని కలిగించే మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు నియంత్రించేందుకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నివారించకపోతే తానే మహిళలతో కలిసి గ్రామాల్లో పర్యటించి బెల్టు దుకాణాలను ధ్వంసం చేస్తానని హెచ్చరించారు.

# హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు..

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ స్థాయిలో ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 46 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను (సీఐ) బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా 32 మంది సీఐలకు కొత్త పోస్టింగ్‌లు కేటాయించారు. పరిపాలనా సౌలభ్యం కోసం చేపట్టిన ఈ బదిలీల్లో చాలా కాలంగా సీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న పలువురు అధికారులకు పోస్టింగ్‌లు లభించాయి. మరో 14 మంది ఇన్‌స్పెక్టర్లను తక్షణమే సీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఇక, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)లో పనిచేస్తున్న సైదులును నాంపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న టి. అశోక్‌కుమార్‌ను లాలాగూడ పీఎస్ సీఐగా బదిలీ చేశారు. ఐటీ సెల్‌లో పనిచేస్తున్న జి. రాజేందర్ గౌడ్‌కు వారాసిగూడ, స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న ఎస్. రాఘవేంద్రకు మంగళ్‌హాట్ బాధ్యతలు అప్పగించారు. గోషామహల్ ట్రాఫిక్‌లో ఉన్న జె. రాజశేఖర్‌ను కీలకమైన టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న ఇమ్యూనల్‌ను సుల్తాన్‌బజార్ ట్రాఫిక్‌కు, రాజును గోషామహల్ ట్రాఫిక్ సీఐగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# కడియం శ్రీహరి కారణంగానే పార్టీ నుంచి వెళ్లిపోయా

## - బీఆర్ఎస్‌లో చేరిన ఆరూరి రమేశ్

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ, కడియం శ్రీహరి లాంటి వ్యక్తుల వల్లే తాను పార్టీ నుంచి బయటకు వెళ్లవలసి వచ్చిందని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక మంది మీద బురద చల్లి వారు రాజకీయంగా ఎదగకుండా చేసిన వ్యక్తి కడియం శ్రీహరి అని ఆరోపించారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డితో ములాకత్ కుదుర్చుకొని, వరంగల్ జిల్లాలో అనేక మంది ఓటమికి కారణమైన వ్యక్తి కడియం శ్రీహరి అన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ కోసం కోవర్టుగా పని చేశారని ఆరోపించారు. ఆయన చేసిన మోసం వల్ల ఫలితాలు బీఆర్ఎస్‌కు ఎలా వచ్చాయో అందరికీ తెలుసని, అందుకే పార్లమెంట్ ఎన్నికల సమయంలో తాను బయటకు వెళ్లానని అన్నారు. ఇప్పుడు ఆ పాపాత్ముడు బయటకు పోయాడు కాబట్టి తిరిగి సొంత ఇంటికి వచ్చానని అన్నారు. చిన్నప్పుడు పిల్లవాడు తప్పిపోయిన తర్వాత తిరిగి ఇంటికి వస్తే ఎలా సంబరం ఉంటుందో ఇప్పుడు పార్టీలో, తనకు అంతటి సంతోషం ఉందని అన్నారు.

ఆరూరి రమేశ్ పోవడానికి కారణం అదే: ఎర్రబెల్లి దయాకర్ రావు

ఆరూరి రమేశ్ బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోవడానికి కడియం శ్రీహరి కారణమని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కడియం శ్రీహరి వంటి మోసపూరిత వ్యక్తికి టిక్కెట్ ఇచ్చారనే ఆవేదనతోనే అతను పార్టీ నుంచి వెళ్లిపోయాడని అన్నారు. కానీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై ఎప్పుడూ ఆయనకు కోపం లేదని అన్నారు. భవిష్యత్తులో ఎన్నిక ఏదైనా బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటామని అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి అమిత్ షా రాక,

## ఫిబ్రవరి 3 నుంచి రేవంత్ రెడ్డి ప్రచారం

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 28, (తొలివెలుగు) : తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారం కోసం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా రానున్నారని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తెలిపారు. ఎన్నికల ప్రచారం కోసం జాతీయ నేతలు కూడా వస్తున్నారని ఆయన వెల్లడించారు. పది రోజుల్లో రెండు భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేస్తామని, ఉత్తర తెలంగాణలో ఒక సభ, దక్షిణ తెలంగాణలో మరో సభ నిర్వహిస్తామని అన్నారు.

మరోవైపు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన, ఈ నెలాఖరున స్వదేశానికి రానున్నారు. ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికల కోసం ప్రచారం చేస్తారు. ఫిబ్రవరి 3న నల్గొండ జిల్లా మిర్యాలగూడ, 4న కరీంనగర్ జిల్లా జగిత్యాల, 5న రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8న నిజామాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటిస్తారు.

ఇదిలా ఉండగా, మున్సిపల్ ఎన్నికల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి రోజు 890 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. వీరిలో 382 మంది కాంగ్రెస్ అభ్యర్థులు, 258 మంది బీఆర్ఎస్ అభ్యర్థులు, 169 మంది బీజేపీ అభ్యర్థులు ఉన్నారు.

# గల్లీ నుంచి ఢిల్లీ వరకు కేసీఆర్ మీద చెప్పే అబద్ధం అదే : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి..
పథకాలు అమలు చేశారని తెలిపారు.

ఆరూరీ రమేశ్ 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించారని, కానీ 2023లో 16 వేల ఓట్లతో ఓడిపోయారని అన్నారు. కానీ ఈసారి భారీ మెజారిటీతో వర్ధన్నపేటలో ఆరూరి రమేశ్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే దయచేసి కొత్త, పాత అని చూడవద్దని, అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ రోజు ఓపిక లేని, తెలివి లేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు.

నిత్యం కేసీఆర్‌పై విమర్శలు చేయడం తప్ప ఏదీ లేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఈ రెండున్నర సంవత్సరాలలో లక్షల కోట్ల అప్పులు చేసి ఏం చేశారని ప్రశ్నించారు. రైతు బంధు ఎగ్గొట్టారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదని అన్నారు. అయినప్పటికీ అప్పులు ఎందుకయ్యాయని ప్రశ్నించారు.

మున్సిపల్ ఎన్నికలు మొదలు ప్రతి ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌ను చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. టిక్కెట్ ఎవరికి ఇచ్చారనే విషయం ఆలోచించవద్దని, గులాబీ కండువా కప్పుకుని వస్తే కేసీఆర్‌గా భావించి ఓటు వేయాలని సూచించారు. కుటుంబం అన్నాక విభేదాలు ఉంటాయని, కానీ బీఫామ్ ఇచ్చాక అందరూ కలిసి పోవాలని అన్నారు. 'గులుగుడు గులుగుడే గుద్దుడు గుద్దుడే' అని వ్యాఖ్యానించారు.

# మేడారంలో భక్తులకు ధరల షాక్.. ఆకాశాన్నంటిన రేట్లు..



మొదటిపేజీ తరువాయి..
రూ. 350కి అమ్ముతున్నారు. నాటుకోడి ధర రూ. 700 దాటిపోయింది. జాతర చివరి రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని భక్తులు వాపోతున్నారు.

చుక్కలు చూపిస్తున్న గదుల అద్దెలు

మాంసం ధరలే కాకుండా, బస కోసం ఏర్పాటు చేసుకునే గదుల అద్దెలు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేని చిన్న గదులకు సైతం రోజుకు రూ. 6,000 వరకు వసూలు చేస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కేవలం ఒక్క ఫ్యాన్ మాత్రమే ఉన్న గదికి వేలకు వేలు చెల్లించాల్సి వస్తోంది.

చెట్ల కింద నీడకు సైతం అద్దె

ఇక ఇళ్లు, గదులు దొరకని వారు సేద తీరేందుకు చెట్ల నీడను ఆశ్రయిస్తుంటే, అక్కడ కూడా దోపిడీ తప్పడం లేదు. జాతర పరిసరాల్లోని తోటల యజమానులు చెట్ల కింద నీడను సైతం అద్దెకు ఇస్తున్నారు. ఓ కుటుంబం వంట చేసుకుని, భోజనం చేయడానికి ఒక చెట్టు కింద నీడ కోసం రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తప్పనిసరి పరిస్థితుల్లో స్థానికంగానే కొనుగోలు చేయాల్సి రావడంతో, వ్యాపారులు ఈ విధంగా ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దోపిడీని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

Toli Velugu 29.01.26_Layout 1 1/29/2026 10:09 AM Page 3



## నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా జరగాలి..

### - జిల్లా కలెక్టర్ హనుమంతరావు







భువనగిరి, జనవరి 28 (తొలివెలుగు): మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల స్వీకరణ అత్యంత కీలకమైన ఘట్టమని, ఈ ప్రక్రియలో ఎక్కడా చిన్న పొరపాటుకు తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పక పాటించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. బుధవారం భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, మోత్కూర్, చౌటుప్పల్ పట్టణాల్లోని మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ కౌంటర్లు, హెల్ప్‌డెస్క్‌లు, భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేస్తూ, అన్ని పత్రాలు సమగ్రంగా ఉన్నప్పుడే నామినేషన్లను స్వీకరించాలని అధికారులకు సూచించారు. అభ్యర్థులకు నామినేషన్ దాఖలులో ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌డెస్క్‌ల ద్వారా స్పష్టమైన మార్గదర్శకత్వం అందించాలని, అవసరమైన సూచనలు ముందుగానే ఇవ్వాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో గుంపులు ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు అవకాశం లేకుండా శాంతియుత వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. అలాగే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తేదీలను అభ్యర్థులకు స్పష్టంగా తెలియజేయాలని, ఎన్నికల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.





## ఆపరేషన్ లేకుండానే 'అకలేసియా కార్డియా'కు చికిత్స

- మలక్‌పేట యశోద వైద్యుల విజయం




సూర్యాపేట, జనవరి 28 (తొలివెలుగు) : ఆహారం మింగలేని అరుదైన వ్యాధి అయిన అకలేసియా కార్డియాతో బాధపడుతున్న సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన 63 ఏళ్ల మహిళకు మలక్‌పేట యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు ఆపరేషన్ లేకుండా అత్యాధునిక వైద్య విధానంతో విజయవంతంగా చికిత్స అందించారు. మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ ఎన్. కిషన్ పర్యవేక్షణలో పర్ ఓరల్ ఎండోస్కోపిక్ మయోటోమీ (పీ.ఓ.ఇ.ఎం) విధానంతో చికిత్స నిర్వహించడంతో అన్నవాహిక కండరాల ఒత్తిడి తగ్గి, రోగి ఆహారం మింగగలగడం పూర్తిగా మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. ఎలాంటి సంక్లిష్టతలు లేకుండా చికిత్స పూర్తై, రోగి ఆరోగ్యం వేగంగా కోలుకుంటోందని పేర్కొన్నారు. యశోదా ఆసుపత్రిలోని అత్యాధునిక ఎండోస్కోపిక్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం సమగ్ర వైద్య నిర్వహణ వల్లే ఈ చికిత్స విజయవంతమైందని ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.

## జాతీయ ఒలింపియాడ్‌లో 'శాస్త్ర' విద్యార్థుల ప్రతిభ

- నేషనల్ లెవల్ టెస్టుకు 12 మంది ఎంపిక!




సూర్యాపేట, జనవరి 28 (తొలివెలుగు): గత నెలలో జాతీయ స్థాయిలో నిర్వహించిన బ్రిలియంట్ ఒలింపియాడ్ (బీఎమ్ఓ) టాలెంట్ టెస్ట్లో శాస్త్ర ది న్యూ ఏజ్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాల నుంచి మొత్తం 12 మంది విద్యార్థులు రెండవ స్థాయి పరీక్షకు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. జాతీయ గణిత ఒలింపియాడ్ రెండవ స్థాయికి ఎం. వాగ్దేవి వర్మ (5వ తరగతి), డి. గణేష్ రెడ్డి (5వ తరగతి), ఎస్. యశస్వి (6వ తరగతి), ఎన్. సాయిశ్రీహిత్ (6వ తరగతి), ఎ. మణికంఠ (7వ తరగతి), ఎం. వకుళ (8వ తరగతి), టి. విశిష్ట (8వ తరగతి), ఎస్. జశ్వంత్ రెడ్డి (8వ తరగతి), ఎం. విరూపల్ల (8వ తరగతి), జి. సాత్విక్ (9వ తరగతి) ఎంపికయ్యారు. జాతీయ ఆంగ్ల ఒలింపియాడ్ రెండవ స్థాయికి కె. అభిదాన్ (7వ తరగతి), జాతీయ జనరల్ నాలెడ్జ్ ఒలింపియాడ్ రెండవ స్థాయికి కె. అశ్విత్ రెడ్డి (7వ తరగతి) ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఫిబ్రవరి 1న ఖమ్మంలో జరిగే రెండవ స్థాయి పరీక్షకు హాజరవుతారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాల అసెంబ్లీలో చైర్మన్ ఎం. చంద్రశేఖర్, డైరెక్టర్లు ఎం. కరుణ, వై. పుష్పలత విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ ఎస్.కె. జహంగీర్, ఐఐటి ఫౌండేషన్ అధ్యాపకులు, బోధనా మరియు బోధనేతర సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలోనూ విద్యార్థులు ప్రతిభ చాటుతూ పాఠశాలకు మరింత కీర్తి తీసుకువస్తారని యాజమాన్యం విశ్వాసం వ్యక్తం చేసింది.

## మీ ఊరు.. మీ హక్కు

- గ్రామాభివృద్ధిలో మీ భాగం ఉండాలి.
- గ్రామసభే గ్రామ శాసనసభ: ప్రతి ఓటరు ఒక సభ్యుడే!
- ప్రజాస్వామ్య వేదికపై ప్రగతి చర్చ.. మీ సంతకమే ఊరి భవిష్యత్తు.
- వార్డు నుంచి పంచాయతీ వరకు.. అభివృద్ధిలో మీరే భాగస్వాములు.
- హక్కును వాడుకో.. ఊరిని తీర్చిదిద్దుకో!




వలిగొండ, జనవరి 28 (తొలివెలుగు): గ్రామాభివృద్ధిలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని నిర్ధారించే ప్రజాస్వామ్య వేదికే గ్రామపంచాయతీలో నిర్వహించే గ్రామసభ. సర్పంచి నుంచి సామాన్య ఓటరు వరకు ఒకే వేదికపై కూర్చొని గ్రామ సమస్యలపై చర్చించి, అభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే స్థలం గ్రామసభ. ఇక్కడ చేసే ప్రతి తీర్మానం, ప్రతి సంతకం గ్రామ భవిష్యత్తును నిర్ణయించే శాసనంగా మారుతుంది. గ్రామపంచాయతీలో ఏ అభివృద్ధి పని చేపట్టాలన్నా గ్రామసభ ఆమోదం తప్పనిసరి. అలాంటి గ్రామసభకు హాజరుకాకపోవడం అంటే గ్రామ అభివృద్ధిని ఇతరుల చేతుల్లో పెట్టడమేనని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు. ప్రకారం ఏడాదికి ఆరు సార్లు గ్రామసభ నిర్వహించాలి. సర్పంచి అధ్యక్షతన సభ కొనసాగుతుండగా, సర్పంచి లేనిపక్షంలో ఉపసర్పంచి గ్రామసభను నిర్వహిస్తారు. సభలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను తీర్మానాల రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. మెజారిటీ సభ్యులు ఏ పనికి అంగీకరిస్తే అది తీర్మానంగా మారుతుంది. ఆ తీర్మాన ప్రతిని మూడు రోజుల్లోగా ఉన్నతాధికారులకు పంపితేనే నిధులు మంజూరవుతాయి.

### గ్రామసభ సభ్యులెవరు..?

గ్రామంలోని ఓటర్లందరూ గ్రామసభ సభ్యులే. పంచాయతీ కార్యదర్శి సభ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు శాశ్వత ఆహ్వానితులుగా హాజరవుతారు. సర్పంచి అధ్యక్షతన గ్రామాభివృద్ధిపై చర్చలు జరుగుతాయి.

### ఫిర్యాదుకు అవకాశం

గ్రామసభలో తీసుకున్న తీర్మానాల్లో అవకతవకలు జరిగాయని ఎవరైనా భావిస్తే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. తీర్మానాలను సమీక్షించే అధికారం కలెక్టర్‌కు ఉంటుంది. ఆమోదయోగ్యం కాని తీర్మానాలను కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో రద్దు చేస్తారు. పంచాయతీరాజ్ చట్టం

### కోరం తప్పనిసరి

సాధారణంగా గ్రామంలోని మొత్తం ఓటర్లలో పదోవంతు లేదా గ్రామ జనాభాను బట్టి నిర్ణయించిన సంఖ్యలో సభ్యులు హాజరవడం కోరం. నిర్ణీత సమయంలో కోరం లేకపోతే గ్రామసభను రెండు గంటలపాటు వాయిదా వేస్తారు. అప్పటికీ కోరం లేకపోతే హాజరైన సభ్యులతోనే గ్రామసభను కొనసాగిస్తారు. గ్రామ ఓటర్లు పెద్ద సంఖ్యలో గ్రామసభలకు హాజరుకాకపోతే, సర్పంచి లేదా ఉపసర్పంచి అనుకూలమైన కొద్ది మందితోనే తీర్మానాలు చేయించుకునే అవకాశం ఉంటుందని పలువురు హెచ్చరిస్తున్నారు. అందువల్ల ప్రతి ఓటరు గ్రామసభకు హాజరై తన హక్కును వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు పిలుపునిస్తున్నారు.

## మేడారం జాతరలో తూనికల - కొలతల శాఖ దాడులు

### - తక్కువ తూకం వాడిన 6 దుకాణాలకు జరిమానా





ములుగు జిల్లా / మేడారం, జనవరి 28 (తొలివెలుగు) :మేడారం సమ్మక్క--సారలమ్మ మహాజాతర సందర్భంగా భక్తులకు న్యాయం కల్పించేందుకు ప్రభుత్వ తూనికల--కొలతల శాఖ (లీగల్ మెట్రాలజీ) వరంగల్ జోన్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. వరంగల్ జోన్ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో బెల్లం, మాంసం, కోళ్లు, చికెన్, కిరాణా, కూల్‌డ్రింక్స్ తదితర దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులకు తక్కువ కొలతలు, తక్కువ తూకం రాళ్లు వాడకుండా సరైన త్రాసులు, ప్రమాణ బరువులు ఉపయోగించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అమ్మకాలు జరపాలని దుకాణ దారులకు హెచ్చరించారు. మహాజాతరలో మొత్తం 20 దుకాణాలను తనిఖీ చేయగా, తక్కువ తూకం కలిగిన బరువులు వాడుతున్నట్లు గుర్తించిన 6 మంది దుకాణాదారులకు అపరాధ రుసుములు విధించారు. ఈ తనిఖీల్లో వరంగల్ జోన్ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేశ్వర్ రావుతో పాటు ఉమ్మడి భూపాలపల్లి జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఇ. శ్రీలత, ఖమ్మం జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ప్రవీణ్ కుమార్, వరంగల్ జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి మనోహర్, జనగాం జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఝాన్సీ, హనుమకొండ జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి విశ్వేశ్వర్, మధిర లీగల్ మెట్రాలజీ అధికారి సుభాష్తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

Toli Velugu 29.01.26_Layout 1 1/29/2026 10:09 AM Page 4



# మేడారం జాతరకు జనగామ నుంచి 130 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు





జనగామ జిల్లా, జనవరి 28 (తొలివెలుగు) : మేడారం సమ్మక్క--సారలమ్మ మహాజాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం జనగామ ఆర్టీసీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. జనగామ ప్రశ్న మైదానంలో ప్రత్యేక బస్టాండ్‌ను ఏర్పాటు చేసి, భక్తుల రాకపోకల కోసం 130 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్టాండ్ పరిధిలో మరుగుదొడ్లు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. గత జాతరల్లో బస్సులు సరిపోక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో, డీఎం స్వాతి ప్రత్యేక చొరవ తీసుకుని ఈసారి ముందస్తుగా తగినన్ని బస్సులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రయాణికుల రద్దీ సాధారణంగానే ఉందని, అవసరమైతే పరిస్థితిని బట్టి అదనపు బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

# చౌటుప్పల్‌లో మున్సిపల్ సమరం.. మొదలైన నామినేషన్ల సందడి

- తొలిరోజు 6 దాఖలు
- కాంగ్రెస్ 4, బీఆర్ఎస్ 2 నామినేషన్లు.
- ముగిసిన తొలిరోజు గడువు.. 30వ తేదీ వరకు మరిన్ని దరఖాస్తులు.
- నిబంధనల నడుమ నామినేషన్ల పర్వం.. పర్యవేక్షించిన కమిషనర్ వెంకట్రాంరెడ్డి.



2వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి సుర్వి మంజుల నర్సింహా గౌడ్



5వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి కొయ్యడ శేఖర్

చౌటుప్పల్, జనవరి 28 (తొలివెలుగు) తెలంగాణ రాష్ట్ర రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికలు - 2026లో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీలో బుధవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ లాంఛనంగా ప్రారంభమైంది. నామినేషన్ల తొలి రోజున వివిధ వార్డుల నుంచి మొత్తం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు మున్సిపల్ కమిషనర్, సహాయ జిల్లా ఎన్నికల అధికారి గుత్తా వెంకట్రాంరెడ్డి తెలిపారు. తొలిరోజే ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు బరిలోకి దిగారు. 2వ వార్డు నుంచి కాంగ్రెస్, 5వ వార్డు నుంచి బీఆర్ఎస్, 9వ వార్డు నుంచి కాంగ్రెస్, 13వ వార్డు నుంచి బీఆర్ఎస్, 14వ వార్డు, 16వ వార్డుల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో తమ నామినేషన్లను సమర్పించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు మున్సిపల్ కార్యాలయంలో పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని, ఈ గడువులో మరిన్ని నామినేషన్లు వచ్చే అవకాశం ఉందన్నారు. నామినేషన్ ప్రక్రియ మొత్తం వీడియో గ్రాఫీ పర్యవేక్షణలో, ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని కమిషనర్ వెంకట్రాంరెడ్డి తెలిపారు.



9వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మొగుదాల పావని రమేష్ గౌడ్



13వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి తొర్పునూరి శోభ నర్సింహా గౌడ్



14వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్



16వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి వెన్‌రెడ్డి సంధ్య రాజు

# సీనియర్ జర్నలిస్టు గోగుల జగదీశ్వర్‌కు పరకాల కాంగ్రెస్ నేతల శ్రద్ధాంజలి









పరకాల, జనవరి 28 (తొలివెలుగు) : పరకాల పట్టణ సీనియర్ ఈనాడు పత్రిక రిపోర్టర్ గోగుల నాగరాజు తండ్రి, మొగుళ్లపల్లి సీనియర్ జర్నలిస్టు గోగుల జగదీశ్వర్ నిన్న పరమపదించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం మొగుళ్లపల్లి గ్రామంలో గోగుల జగదీశ్వర్ పార్థివ దేహాన్ని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ దుఃఖ సమయంలో ధైర్యం కలిగి ఉండాలని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జర్నలిజం రంగంలో గోగుల జగదీశ్వర్ చేసిన సేవలు మరువలేనివని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మీ మడికొండ బ్రదర్స్‌తో పాటు నాయకులు బొచ్చు రవి, బొచ్చు జితేందర్, సిలువేరు రాఘవ, బొచ్చు సారయ్య పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో రాజకీయ కండువాల పండుగ

## - కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లోకి సీనియర్ నాయకుడు



వరంగల్ జిల్లా / వర్ధన్నపేట , జనవరి 28 (తొలివెలుగు) : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుజ్జ వీర రాఘవరావు బుధవారం భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు మద్దతు తెలుపడం ఇందుకు నిదర్శనమన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో అనేక గ్రామాలు బిఆర్ఎస్ వైపు నిలిచాయని, ప్రజల్లో ఇప్పటికీ కేసీఆర్ పాలనపై విశ్వాసం బలంగా ఉందని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ జెండా ఎగరేయాలనే సంకల్పంతో ప్రజలు ఎదురుచూస్తున్నారని, అందుకే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గత రెండేళ్లుగా చేపడుతున్న అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేసి, ప్రజల సంక్షేమాన్ని కాపాడిన కెసిఆర్ నాయకత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలనే నిర్ణయంతోనే ప్రజలు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని దయాకర్ రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, ఎన్నికల ఇన్‌చార్జీలు మిట్టు శ్రీనివాస్, చింతల యాదగిరి, పొలపల్లి రామ్మూర్తి, మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి, ఆత్మ చైర్మన్ గోపాల రావు, వైస్ చైర్మన్ కొమ్మండ్ల ఏలేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు కుమారస్వామి, ఆంగోత్ బిక్షపతి, గుజ్జ గోపాల్ రావు, వసంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పరకాల మున్సిపల్ ఎన్నికల వేడి మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య నామినేషన్ దాఖలు



పరకాల, జనవరి 28 (తొలివెలుగు): హనుమకొండ జిల్లా , పరకాల పురపాలక సంఘంలో జరగనున్న 2వ మున్సిపల్ సాధారణ ఎన్నికలు--2026 నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎన్నికల నగారా మోగడంతో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పరకాల మున్సిపాలిటీకి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ మార్త రాజభద్రయ్య భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తరపున 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. గతంలో ప్రజల మద్దతుతో సేవలందించిన అనుభవంతో ఈసారి కూడా 11వ వార్డు నుంచి విజయం సాధిస్తాననే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన తనకు సంబంధించిన నామినేషన్ పత్రాలను అధికారికంగా దాఖలు చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ ముఖ్య నాయకులు, బీజేపీ కార్యకర్తలు హాజరై తమ మద్దతు తెలిపారు. నామినేషన్ దాఖలుతో పరకాల పట్టణంలో ఎన్నికల సందడి మరింత పెరిగింది.